
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ఉష్ణోగ్రత | ఖమ్మం : గరిష్ఠం 29 | కనిష్ఠం 18 | భద్రాద్రి : గరిష్ఠం 27 | కనిష్ఠం 18 | గురువారం, 4 జనవరి 2024

ఆక్రమణల లెక్క తేలేనా?



- ఖమ్మం జిల్లాలో పలుచోట్ల ఎన్నెస్పీ భూముల అన్యాక్రాంతం
- అనుమతి లేకుండా వెలుస్తున్న షెడ్లు
- అధికారులు తీసుకోబోయే చర్యలపై సర్వత్రా ఆసక్తి


ఖమ్మం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నో ఏళ్లుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు చెందిన భూముల ఆక్రమణల పర్వంపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. సాగర్ మిగులు భూముల విషయంలో ప్రభుత్వం నుంచి ఎన్నెస్పీ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందినట్టు తెలిసింది. ఈ నాగార్జునసాగర్ ఎడమ కాలువ నిర్మాణ సమయంలో నాటి ప్రభుత్వం జిల్లాలోని రైతులకు డబ్బులు చెల్లించి భూములను సేకరించింది. ఈ క్రమంలో కాలువలు తవ్వగా మిగిలిన భూముల్లో మట్టిపోసి అప్రోచ్‌గా మార్చింది. కానీ కాలానుగుణంగా పలుచోట్ల ఆ మిగులు భూములు అన్యాక్రాంతమయ్యాయి. అయితే అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. త్వరలోనే కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల లెక్కతేలుస్తామని ప్రకటించింది. అదే సమయంలో ఎన్నెస్పీ మిగులు భూములపైనా దృష్టి పెట్టి అన్యాక్రాంతమైన వాటిని గుర్తించాలని ఎన్నెస్పీ అధికారుకుల ఆదేశాలిచ్చిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఆ అధికారులు ఎంతమేరకు ఈ భూములపై దృష్టిపెడతారన్న దానిపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది.

తప్పుడు పత్రాలతో చెరపట్టారు..

జిల్లాలో చాలాప్రాంతాల్లో ఆక్రణమణల పర్వం కొనసాగింది. పాలేరు నుంచి కల్లూరు వరకు ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన ఉన్న ఎన్నెస్పీ భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ పెద్దలు తమకున్న పలుకుబడి, అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు పత్రాలు సృష్టించి సొంతం చేసుకున్నారు. అలాగే కొందరు తాము రైతుల వద్ద కొనుగోలు చేసినట్టు రికార్డులు సృష్టించి.. ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారులకు ముడుపులు చెల్లించి ఎన్‌వోసీలు పొంది చెరపట్టారు. దీంతో వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయి. ఈ క్రమంలో కోట్ల విలువైన సాగర్ మిగులు భూములు అక్రమార్కుల చెరలో చిక్కాయి. ఇలా కూసుమంచి, ఖమ్మంరూరల్, ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం, కొణిజర్ల, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లితోపాటు ఇతర ప్రాంతాల్లోనూ వందల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. ఖమ్మంనగరంలో కూడా కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టుల ద్వారా ఎన్నెస్పీ మిగులుభూములను సొంతం చేసుకున్న సంఘటనలున్నాయి. వీటిపై ఎన్నెస్పీ అధికారులు కిందికోర్టు తీర్పును సవాల్‌చేస్తూ పైకోర్టుకు వెళ్లకుండా మౌనంగా ఉండడంతో పాత రైతుల పేర్లతో కొనుగోలు చేసుకుని క్రమబద్ధీకరణ సాగించారు. ఎవరు అధికారంలో ఉంటే వారిదే పైచేయి అన్నట్టుగా సాగర్ భూముల వ్యవహారం సాగింది. కానీ అక్రమాల నిగ్గుతేల్చాల్సిన.. ఎన్నెస్పీ అధికారులేమో తాము రెవెన్యూకు అప్పగించామని, రెవెన్యూ అధికారులేమో ఈ భూములపై తమకు హక్కు లేదని.. ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలున్నాయి.

అనుమతి లేకుండా నిర్మాణాలు..

ప్రస్తుతం భూముల రేట్లు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో.. సాగర్ మిగుల భూముల విలువ కూడా రూ.కోట్లలో పలుకుతుండడంతో కొందరు తమకు పట్టాలు, హక్కులు ఉన్నాయని చెబుతూ.. కార్పొరేషన్, గ్రామపంచాయతీలనుంచి అనుమతి లేకుండానే షెడ్లు, భవనాలు నిర్మిస్తున్నారు. రాత్రికి రాత్రే నిర్మాణాలు సాగిస్తున్నారు. ఖమ్మంనుంచి వైరారోడ్డులో ఇలాంటి నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రికి రాత్రి ప్రహరీలు నిర్మిస్తూ ఈభూములు తమవి అన్నట్టుగా బోర్డులు పాతడం, నిర్మాణాలు చేస్తుండటం లాంటివి చేస్తున్నారు. రెవెన్యూ, ఎన్నెస్పీ, కార్పొరేషన్ గ్రామపంచాయతీలు ఈనిర్మాణాల జోలికి వెళ్లలేకపోతున్నారు. పట్టా భూములున్నా ముందస్తుగా నిర్మాణ పనులకు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేపట్టి ఆ తర్వాత ఇంటినెంబర్లు తీసుకోవడం, విద్యుత్ మీటర్లు పెట్టి ఇవే ఆధారాలతో కోర్టులకు వెళ్లడం రియల్ వ్యాపారంలో ఒక భాగంగా మారింది. ఖమ్మం వైరా రోడ్డులోని ఎన్నెస్పీ మిగులుభూముల్లో గతంలో జిల్లారెవెన్యూ, ఎన్నెస్పీ అధికారులు నిర్మాణాలను తొలిగించి.. అవి ఎన్నెస్పీ భూములుగా తేల్చారు. ఇప్పుడు అవే భూముల్లో మళ్లీ ప్రైవేటు వ్యక్తులు ప్రహరీలు, షెడ్లు నిర్మించి పట్టా భూములని చూపుతున్నారు. వారిలో కొందరు అధికార పార్టీ నేతల పేర్లు చెబుతుండడంతో అధికారులు కూడా రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే తాము పరిశీలిస్తామని తప్పుకొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో అధికారులు ఎన్నెస్పీ మిగుల భూముల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. వాస్తవానికి గతంలో రైతులు ప్రభుత్వం నుంచి పరిహారం పొందగా వారి వారసుల నుంచి కొందరు కొనుగోలు చేసినట్టు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు చూపి ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారుల సహకారంతో కొందరు క్రమబద్ధీకరణలు చేయించుకున్నారు. ఈతప్పుడు పత్రాలపైనా కూడా అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనికితోడు గతంలో కిందికోర్టు ఇచ్చినతీర్పులపై ఎన్నెస్పీ అధికారులు ప్రభుత్వం తరుపున పై కోర్టులకు వెళితే ప్రభుత్వానికే ఈ భూములు దక్కే అవకాశం ఉంది. రెవెన్యూ, ఎన్నెస్పీ, సర్వే అధికారులు ఉమ్మడిగా సాగర్ కాలవ నిర్మాణ సమయంలో జరిగిన భూసేకరణ ఫైళ్లను, మ్యాపులను పరిశీలించి హద్దులు ఏర్పాటు చేస్తే ఎన్నెస్పీ మిగులుభూములేవో, రైతుల రైతుల పట్టా భూములేవో స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.



క్రమబద్ధీకరణపై

చిగురిస్తున్న ఆశలు

- ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌పై ప్రభుత్వ దృష్టి
- ఉమ్మడిజిల్లాలో 82వేల మంది దరఖాస్తుదారులు

ఖమ్మం కార్పొరేషన్, జనవరి 3: రాష్ట్రంలో అక్రమ ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్). బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీం (బీఆర్‌ఎస్)లను తెరపైకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 2020నాటికి వీటి ద్వారా తమ స్థలాలను క్రమబద్ధీకరించుకుని హక్కులు పొందేందుకు ఉమ్మడి జిల్లాలో సుమారు 82వేల మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం, ఖమ్మం నగరంలో సుమారు 4వేల మంది బీఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అవన్నీ పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సర్వే చేయాలని ఆదేశించడంతో.. అప్పట్లో ఖమ్మం నగరపాలక సంస్థతో పాటు ఇరుజిల్లాల్లోని మునిసిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే చేపట్టారు. అయితే ఈ లోపు అసెంబ్లీ ఎన్నికలు రావడం, భారతరాష్ట్ర సమితి అధికారం కోల్పోయి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ అమలు జరుగుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించటంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఎల్‌ఆర్‌ఎస్‌కు నాలుగేళ్లుగా ఎదురుచూపు..

అక్రమప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నవారు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. 2020 ఆగస్టువరకు ఉన్న అక్రమ స్థలాలు, అక్రమ వెంచర్లను ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమబద్ధీకరించాలని ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించటంతో ఇరుజిల్లాల్లోని దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. ఉమ్మడిజిల్లాలో సుమారు 82వేల మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఒక్కో ప్లాటుకు రూ.1000చొప్పున, లేఅవుట్లు, వెంచర్ల క్రమబద్ధీకరణ కోసం రూ.10వేలు దరఖాస్తు రుసుంగా చెల్లించారు. ఈ ప్రక్రియ తర్వాత సదరు ప్లాట్లు, వెంచర్లను సర్వే చేయాల్సి ఉండగా, పలుకారణాలతో ఆ సర్వేను వాయిదా వేశారు. ఆ తర్వాత సర్వే చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించినా, ఎన్నికలు రావడంతో సర్వే ప్రక్రియకు బ్రేక్‌పడింది.

ఇరుజిల్లాల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఇలా..

ఖమ్మం నగరపాలకసంస్థ :	40,000
స్తంభాద్రి పట్టణాభివృద్ధిసంస్థ పరిధిలో:	21,000
మధిర మునిసిపాలిటీ పరిధిలో :	4,200
సత్తుపల్లి :	3,700
వైరా :	3500
పాల్వంచ :	8,800
కొత్తగూడెం :	656
ఇల్లెందు :	36

బీఆర్‌ఎస్ కోసం తొమ్మిదేళ్లుగా నిరీక్షణ..

అక్రమ భవనాల క్రమబద్ధీకరణ కోసం 2015లోనే దరఖాస్తులు స్వీకరించారు. రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.1000 వసూలు చేశారు. బీఆర్‌ఎస్ కోసం మిగతా పురపాలకాల్లో ఎవరూ దరఖాస్తు చేయలేదు కానీ ఖమ్మంనగరంలో మాత్రం 4వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొందరు బీఆర్‌ఎస్ నిబంధనలపై కోర్టును ఆశ్రయించడంతో తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

‘సీతారామ’ పనుల్లో వేగం పెంచాలి

- ఈ ఏడాదే సత్తుపల్లి ట్రంక్, లంకాలపల్లి, వైరా రిజర్వాయర్లకు గోదావరి నీరు
- భూసేకరణ, అటవీశాఖ అనుమతుల కోసం కృషి
- వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- గండుగులపల్లి పంప్‌హౌజ్ పరిశీలన, అధికారులతో సమీక్ష

అశ్వారావుపేట/దమ్మపేట, జనవరి 3: ఐదేళ్లుగా నత్తనడకన కొనసాగుతున్న.. ఉమ్మడిజిల్లా వరప్రదాయని సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ ఎకరానికి గోదావరి నీటిని అందించడమే తన జీవిత లక్ష్యమని ప్రకటించిన తుమ్మల.. ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. బుధవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి గండుగులపల్లిలోని సీతారామ ప్రాజెక్టు పంపు హౌస్ పనులను పరిశీలించిన ఆయన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు సీతారామ ప్రాజెక్టు మ్యాప్, జరుగుతున్న పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. యాతాలకుంట టన్నెల్ పూర్తి చేసి సత్తుపల్లి ట్రంక్, లంకపల్లి రిజర్వాయర్‌కు, ఇంకో చోట టన్నెల్‌ను నిర్మించడం ద్వారా వైరా రిజర్వాయర్‌కు ఈ సీజన్‌లోనే లక్షన్నర ఎకరాలకు సాగునీటిని అందించే అవకాశం ఉందని తెలిపారు. రూ.13,500కోట్ల అంచనాలతో ప్రారంభించిన సీతారామ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.7వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేకపోవడం సరికాదన్నారు. ఇప్పటికే మూడు పంపు హౌస్‌లు పూర్తయ్యాయని, మరో పంపు హౌస్ పని జరగాల్సి ఉందన్నారు. ఈ పంపుహౌస్ పనులకోసం అటవీ శాఖ అనుమతులు, భూసేకరణ పనులు జరగాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు నిర్మించిన పంపుహౌస్, టన్నెల్స్, ఇతర పనుల్లో మధ్యమధ్యన ఖాళీలు, వంతెనలు, అక్విడేట్‌లు కొద్దిపాటి ఖర్చుతో నిర్మిస్తే ప్రతి ఏటా లక్షన్నర ఎకరాల చొప్పున గోదావరి నీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అందించవచ్చన్నారు. ప్రాజెక్టు మొత్తం పూర్తయ్యేవరకు వేచి చూడకుండా ఎప్పటికప్పుడు గ్యాప్‌లను పూర్తిచేసి సాగునీటిని అందించాలని ఆదేశించారు. తద్వారా ప్రాజెక్టు మొత్తం పూర్తికాకుండానే చాలా భాగానికి సాగునీటిని అందించగలమన్నారు. టన్నెల్ పనులు వేగవంతం అయ్యేందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు భూసేకరణ, అటవీ అనుమతులు, సీతమ్మసాగర్ పవర్‌ప్రాజెక్టు జెన్‌కో పవర్ హౌజ్ టెండరు ప్రక్రియ, అనుమతులు పూర్తి చేయాలని సూచించారు. ఈ ఏడాదికి వైరా రిజర్వాయర్‌కు నీరందించడం ద్వారా నాగార్జున్‌సాగర్ ఆయకట్టుకు అవసరమైనప్పుడు సాగునీటిని అందించగలమన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు అనుమతులు, 3వ టన్నెల్ అనుమతులు, అటవీ అనుమతుల క్లియరెన్స్, భూ సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ఆటంకం కలగకుండా పనులు ఎలా చేపట్టాలో ఆలోచించాలన్నారు. సాధ్యమైనంతవరకు వచ్చే నాలుగునెలల్లోనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు సమీప గ్రామాలు ముంపునకు గురికాకుండా ఇరువైపుల రక్షణ గోడలు నిర్మిస్తామని తెలిపారు. ఈ రక్షణ గోడల వల్ల గోదావరి 63 అడుగులకు వచ్చినా ఎలాంటి ముంపు సమస్య ఉండదన్నారు. 6.74లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి జిల్లాలోని అన్ని మధ్యతరహా ప్రాజెక్టులకు నీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లా కలెక్టర్లు ప్రియాంక అల, వీపీ గౌతం, ఇరిగేషన్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఈఈలు అర్జున్, సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీతారామ ప్రాజెక్టు మ్యాప్‌ను మంత్రి తుమ్మలకు చూపుతున్న ఇరిగేషన్ అధికారులు



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చూస్తున్న మంత్రి తుమ్మల, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక



గండుగులపల్లి పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సీపీగా

సునీల్‌దత్

- డీజీపీ కార్యాలయానికి విష్ణువారియర్ బదిలీ
- భద్రాద్రి ఎస్పీగా రోహిత్‌రాజ్
- మాదాపూర్ డీసీపీగా వెళ్లనున్న వినీత్



సునీల్‌దత్



విష్ణువారియర్

ఖమ్మం క్రైం /కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, జనవరి 3 : ఖమ్మం పోలీస్ కమిషనర్‌గా సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీగా బిరుదురాజు రోహిత్‌రాజ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2014బ్యాచ్‌కు చెందిన సునీల్‌దత్ ప్రస్తుతం హైదరాబాద్ నగర డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా కూడా పనిచేశారు. ఆ సమయంలో శాంతిభద్రతలను కాపాడటంలో తన వంతు కృషి చేసిన సునీల్‌దత్ ఖమ్మం సీపీగా నియమితులయ్యారు. ఆయన నేడో రేపో బాధ్యతలు చెపట్టనున్నట్టు తెలుస్తోంది. ఇక ప్రస్తుత సీపీ విష్ణు వారియర్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. 2013 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారియర్ ఆదిలాబాద్ ఎస్పీగా విధులు నిర్వహిస్తూ 2021 ఏప్రిల్ 6న ఖమ్మం సీపీగా బాధ్యతలు చేపట్టారు. కరోనా విపత్కర సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, లాక్‌డౌన్‌ను పకడ్బందీగా నిర్వహించడంతోపాటు పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల బాగోగులను తెలుసుకుంటూ అండగా నిలిచారన్న పేరుంది. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లాలోని కిందిస్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించారన్న పేరుంది. అయితే ఐదేళ్లపాటు డిప్యూటేషన్‌పై ఎన్‌ఐఏకు పంపాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి గత నెల 29న లేఖ పంపిన విషయం తెలిసిందే. కానీ ఆయన్ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులిచ్చింది.

- భద్రాద్రి కొత్త ఎస్పీగా 2018 బ్యాచ్‌కు చెందిన బిరుదురాజు రోహిత్‌రాజ్ నియమితులయ్యారు. వరంగల్ జిల్లాకు చెందిన రోహిత్‌రాజుది పోలీస్ నేపథ్యం కలిగిన కుటుంబం. కష్టపడి చదువుతూ సివిల్స్‌లో ఐపీఎస్ సాధించిన ఆయన తొలిపోస్టింగ్‌గా ప్రొబిషినరీ కాలంలో లక్ష్మీదేవిపల్లి మండలంలో విధులు నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం, పాల్వంచ పోలీస్‌డివిజన్ ప్రత్యేకాధికారిగా, భద్రాచలం ఏఎస్పీగా పనిచేశారు. మావోయిస్టు కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో కీలకంగా వ్యవహరించారన్న పేరుంది. అనంతరం పదోన్నతిపై గ్రేహౌండ్స్ ఎస్పీగా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ సౌత్ ఈస్ట్‌జోన్ ఏఎస్పీగా పని చేస్తూ భద్రాద్రి ఎస్పీగా రానున్నారు. గతంలో భద్రాద్రి జిల్లాలో పని చేసిన అనుభవం ఉన్న ఎస్పీ రోహిత్ రాజు కరోనా సమయంలో అందించిన సేవలతో ప్రజల్లో గుర్తుండిపోయారు. ఇక ప్రస్తుతం భద్రాద్రి ఎస్పీగా ఉన్న 2017 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ జి.వినీత్ సైబరాబాద్ మాదాపూర్‌కు బదిలీ అయ్యారు. ఇదిలాఉంటే ఉమ్మడిజిల్లాలోని పలువురు కింది స్థాయి అధికారులు కూడా మరికొద్ది రోజుల్లో బదిలీ అవబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది.



భద్రాద్రి కొత్త ఎస్పీ రోహిత్‌రాజ్



బదిలీ అయిన ఎస్పీ వినీత్

వెలుగు వెనుక అవినీతి చీకటి!

- భారజల కర్మాగార సోలార్‌ప్లాంట్ నిర్మాణంలో అక్రమాలు
- రూ.కోట్లల్లో నిర్మాణ సంస్థ నిధుల దుర్వినియోగం
- స్థానిక అధికారుల విచారణతో సుమారు రూ.కోటి రికవరీ
- రంగంలోకి దిగిన కేంద్ర విజిలెన్స్ కమిటీ
- ‘ఆర్‌టీఐ’తో ఆలస్యంగా వెలుగులోకి వ్యవహారం

మణుగూరు, జనవరి 3: అశ్వాపురం మండలంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ పరిధిలోని మణుగూరు భారజల కర్మాగారం (హెచ్‌డబ్ల్యూపీ)లో 2015లో నిర్మించిన 12మెగావాట్ల సోలార్‌విద్యుత్‌ప్లాంట్ పనుల్లో కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై భారజల కర్మాగారానికి చెందిన ఓ ఉద్యోగి సమాచార హక్కు చట్టం ద్వారా కొంత సమాచారాన్ని సేకరించి కేంద్ర విజిలెన్స్ కమిటీకి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా ఈవిషయంపై స్థానిక అధికారులకు కూడా ఫిర్యాదు చేయగా అంతర్గత కమిటీల ద్వారా విచారణ చేసి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. లాంకో సోలార్ ఎనర్జీ ప్రైవేటు కంపెనీకి ఈ నిర్మాణ బాధ్యతలు అప్పగించగా అక్రమాలకు పాల్పడిన ఈ కంపెనీ నుంచి రూ.50లక్షల చొప్పున రెండుసార్లు సొమ్మును రికవరీ చేసినట్లు తెలిసింది.

అక్రమాలు ఎలా జరిగాయంటే..

హెచ్‌డబ్ల్యూపీ సోలార్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి హెవీ వాటర్‌బోర్డ్ లాంకో సోలార్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకుని వర్క్ ఆర్డర్‌ను ఇచ్చింది. అయితే వర్క్ ఆర్డర్‌లో కంపెనీ పొందుపరిచిన నిబంధనలను ఉల్లఘిస్తూ నిర్మాణ సంస్థ పనులు చేసినట్లు ఎంక్వైరీ కమిటీలు గుర్తించాయి. వాటిలో ముఖ్యంగా రివర్స్ బ్లాకింగ్ డైయోడ్స్ సరఫరా చేయకపోవడం, పీవి మాడ్యూల్స్‌కు ఆర్‌ఎఫ్‌ఐడీ ట్యాగ్స్‌ను అమర్చకపోవడం, ఐపీ 65స్థానంలో ఐపీ55 జెబీఎస్‌లను అమర్చడం, ప్రింటర్స్‌ను సరఫరా చేయకపోవడం, టూల్ రూం లాబీని నిబంధనల ప్రకారం నిర్మించకపోవడం, నిబంధనల్లోలేని ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయడం, పీవీ మాడ్యూల్స్ పాడైపోయాయని పేర్కొంటూ సొమ్ము కాజేయడం, ఇల్యూమినేటెడ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం. ఆర్‌ఎఫ్ ఐడీ ట్యాగ్‌లను సరఫరా చేయలేదని గుర్తించారు. ఈ అక్రమాలను గుర్తించిన స్థానిక విచారణ కమిటీలు రూ.45లక్షలు రికవరీని చేశారు. ఇది కాకుండా మరి కొంత నగదుగను కూడా రికవరీ చేసినట్లు తెలిసింది.

వెలుగుచూడని అక్రమాలెన్నో..

భారత రక్షణ రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న మణుగూరు హవీ వాటర్ ప్లాంట్‌లోని సోలార్ నిర్మాణంలో భారీ అక్రమాలు జరగడం విస్మయాన్ని కలిగిస్తోంది. సుమారు రూ.100కోట్లతో నిర్మించిన ఈ ప్లాంట్‌లో జరిగిన అక్రమాలు ఆర్‌టీఐ ద్వారా వెలుగు చూడగా సుమారు రూ.కోటి అవినీతి జరిగినట్లు అంతర్గత కమిటీలు నిగ్గు తేల్చాయి. అయితే ఈ ప్లాంట్ నిర్మాణంలో వెలుగు చూడని అవినీతి, అక్రమాలు మరిన్ని జరిగి ఉంటాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నిర్మాణ కంపెనీ నుంచి ఇప్పటికి రూ.కోటి వరకు రికవరీ చేసిన విచారణ అధికారులు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా వర్క్‌ఆర్డర్ ప్రకారం సోలార్ ప్లేట్స్ సరఫరా చేయకుండా బిల్లు చెల్లించినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. పనులు పూర్తి కాకపోయినా నిర్మాణ బిల్లులు కూడా చెల్లించినట్లు తెలిసింది. స్థానిక అధికారులు నిగ్గు తెల్చిన అక్రమాలు కొన్నయితే కేంద్రవిజిలెన్స్ అధికారులు గత సెప్టెంబరులో అశ్వాపురం వచ్చిన విచారణ చేపట్టినట్లు తెలిసింది. సీవీసీ కూడా ఈ ప్లాంట్ నిర్మాణంలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించినట్లు సమాచారం. ఈ విచారణలో ఇంకెన్ని అక్రమాలు బయటపడనున్నాయో వేచి చూడాల్సిందే. ఈ నెల 24న హెవీవాటర్ బోర్డు అత్యున్నతస్థాయి అధికారుల సమావేశం మణుగూరు హెవీ వాటర్‌ప్లాంట్‌లో జరగనున్న నేపథ్యంలో ఈ అక్రమాలు నిగ్గుతేలతాయా లేక అంతర్గతంగా కప్పెస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై హెచ్‌డబ్ల్యూపి ఏడీఎంవోను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. దీంతో సీఏవో ద్వారా ఉన్నతాధికారుల వివరణ కోరేందుకు మెయిల్ ద్వారా ప్రయత్నించగా ఆయన కూడా సకాలంలో స్పందించలేదు.



సోలార్ ప్లాంట్ నమూనా ఫైల్

ప్రభుత్వ ఆసుపత్రి పనులపై అసంతృప్తి

- అవసరానికి తగ్గట్టుగా ప్లాన్ మార్చాలని

ఖమ్మం జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశాలు

- పాత బేస్‌మెంట్‌పై ప్రహరీ ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్న
- త్వరలో ఆసుపత్రి ప్రారంభం ?


ఆసుపత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న జిల్లా మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్, జనవరి 3: సత్తుపల్లిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని జిల్లా మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి గదులను ప్లాన్ ప్రకారమే నిర్మించామంటూ కాంట్రాక్టర్‌కు చెందిన వ్యక్తులు చెబుతుండగా ప్రస్తుతం పరిస్థితికి తగ్గట్లుగా సరిచేయాలంటూ ఆదేశించారు. అదేవిధంగా ఆసుపత్రి నిర్మాణంలో వాడిన ఇటుకలు, సిమెంట్, ఇసుక, ఇతర భవన నిర్మాణ సామగ్రి నాణ్యతపై ప్రశ్నించారు. ఆసుపత్రి ముఖద్వారం మార్చాలని గతంలోనే ఆదేశించగా ఇప్పటివరకు అందుకు సంబంధించిన నిర్మాణాలు ఎందుకు పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టలేదని ప్రశ్నించారు. వైద్యాధికారులు, సిబ్బందికి అవసరమైన రీతిలో గదులలో లోపల నిర్మించాలని కోరారు. అదేవిధంగా ఆసుపత్రికి తూర్పు వైపునున్న పాత ప్రహరీని పడగొట్టి అదే బేస్‌మెంట్‌పై నూతనంగా గోడను ఎలా నిర్మించారని విలేకరులు ప్రశ్నించడంతో దానిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని మెడికల్ ఆఫీసర్ చెప్పారు.


పాత బేస్‌మెంట్‌పై నిర్మించిన ప్రహరీ (ఫైల్)

పూర్తిస్థాయిలో వైద్యాధికారులు

సత్తుపల్లి ఆసుపత్రిని సంక్రాంతికల్లా ప్రారంభించనున్నామని, ఇందుకు సంబంధించిన పూర్తి ఏర్పా ట్లు చేయాలని గుత్తేదారును ఆదేశించారు. జిల్లాలో సత్తుపల్లితో పాటు మధిర, తిరుమలాయపాలెం, కల్లూరు, పెనుబల్లి, నేలకొండపల్లిలలో పూర్తిస్థాయిలో వైద్యాధికారులతో పాటు సిబ్బందిని నియమిస్తామన్నారు. వైరాలో 100పడకల ఆసుపత్రి నిర్మాణానికి కొణిజర్ల మార్గంలో స్థల సేకరణలో ఉన్నామని, 24గంటల పాటు పూర్తిస్థాయిలో పోస్టమార్టమ్ సేవలందించేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మెడికల్ ఆఫీసర్ల నియామకంలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారిని ప్రత్యేకంగా రిక్రూట్ చేసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు కే.వెంకటేశ్వర్లు, లునావత్ భాస్కర్‌నాయక్, ఎన్ఎస్ విజయలక్ష్మీ, ఫార్మాసిస్ సతీష్, సిబ్బంది ఉన్నారు.

మధిర ఎఫ్‌వో వెంకటేశ్వరరావుకు
రాష్ట్రస్థాయి ఫైర్ సేవాపురస్కారం


ఎఫ్‌వోను ఘనంగా సన్మానిస్తున్న మధిర ఫైర్ సిబ్బంది


వెంకటేశ్వరరావు

మధిర, జనవరి 3: ప్రభుత్వం పోలీస్‌శాఖలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉత్తమ సేవాపురస్కారాల ఎంపికలో బాగంగా ఫైర్ శాఖలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులను సేవాపురస్కారాలకు ఎంపిక చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లానుంచి మధిర ఫైర్ ఆఫీసర్ యర్రగుంట వెంకటేశ్వరరావును ప్రభుత్వ సేవాపురస్కారాన్ని ఎంపికచేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉత్తర్వులు బుధవారం మధిర ఎఫ్‌వో అందుకోవడంతో ఫైర్ శాఖ సిబ్బంది ఆయన్ని ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వరరావు గతంలోనూ పలు అవార్డులు అందుకున్నారు. వంద గ్రామాలకు ఒకే ఫైర్ స్టేషన ఉన్నా సుదూర ప్రాంతాల్లోనూ ఆస్తి, ప్రాణ నష్టం అరికట్టడంలో ఆయన చేస్తున్న కృషికి 2013లో అప్పటి కలెక్టర్‌చేతుల మీదుగా బెస్ట్ లీడింగ్ ఫైర్‌మెన్ అవార్డు అందుకున్నారు. 2016లో కృష్ణాపురస్కారాల సందర్భంగా విశిష్టసేవాపురస్కారం , 2022లో ఉత్తమ సేవలకు రాష్ట్రపతి పురస్కారం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ మధిర నియోజకవర్గ ప్రజలు, సిబ్బంది సహాయసహకారాలతో అగ్నిప్రమాదాలను సకాలంలో నివారించామన్నారు. తన సేవలకు ప్రభుత్వం గుర్తింపు లభించడం చాలా ఆనందంగా ఉందని తన సంతోషం వ్యక్తం చేశారు.

ఎర్రుపాలెంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలి

● కేంద్రమంత్రికి ఎంపీ నామా వినతి



ఖమ్మంకార్పొరేషన్, జనవరి 3: చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధిచెందిన జమలాపురం వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రాన్ని పరిగణలోకి తీసుకొని, ఎర్రుపాలెం రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు బుధవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి లేఖ అందజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని డోర్నకల్-విజయవాడ మార్గంలో ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ ఉందని, ఎర్రుపాలెం మండల పరిధిలోనే చారిత్రాత్మకమైన జమలాపురం వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉందని నామా కేంద్రమంత్రికి వివరించారు. తెలంగాణా చిన్న తిరుపతిగా పిలవబడే ఈ దేవాలయాన్ని ప్రతి ఏటా 10లక్షలనుంచి 15లక్షల మంది భక్తులు దర్శించుకుంటారని, ఎర్రుపాలెం స్టేషన్‌లో శాతవాహనకు హాల్ట్ లేకపోవటంతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈసమస్యను తాను గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించానని, ఇప్పటికైనా స్పందించి ఎర్రుపాలెం స్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని నామా కోరారు.

కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

●ఏడు కిలోల క్యాన్సర్ కణితి తొలగింపు


వైద్యులు తొలగించిన కణితి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, జనవరి 3: ఓ వృద్ధురాలి కడుపులో నుంచి ఏడు కేజీల క్యాన్సర్ కణితి తొలగించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన సంఘటన బుధవారం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో చోటుచేసుకుంది. ఈ శస్త్ర చికిత్సకు సంబంధించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బోడ కుమారస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తగూడెం పట్టణానికి చెందిన రామవరం ప్రాంతంలో నివసిస్తున్న 90 ఏళ్ల ఎస్‌కే. ఫాతిమాబి తీవ్ర కడుపునొప్పితో మూడు నెలల నుంచి బాధపడుతుంది. ఈ క్రమంలో కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిని చికిత్స కోసం ఆశ్రయించగా పరీక్షలు చేసిన వైద్యులు కడుపులో క్యాన్సర్ కణితి ఉన్నట్లు గుర్తించారు. తక్షణమే వైద్యం అందించి దానిని తొలగించాలని రోగి బంధువులకు వైద్యులు తెలిపారు. దీంతో రోగి ఫాతిమాభికు అరుదైన శస్త్ర చికిత్సను సర్వజన ఆసుపత్రిలో నిర్వహించి కడుపులో ఉన్న ఏడు కేజీల కణితిని తొలగించి ప్రాణాపాయం నుంచి రక్షించారు. శస్త్ర చికిత్స విజయవంతం చేసినందుకు వైద్యులకు కుటుంబసభ్యులు ప్రత్యేకంగా అభినందించి ధన్యవాదాలు తెలిపారు. శస్త్ర చికిత్స చేసిన వారిలో డాక్టర్లు సురేందర్, నవ్యదీప్, నిరంజన్, శిరీష, నాగేశ్వరరావు, లతీఫ్, సిబ్బంది వేదవతి, నాగమణి తదితరులు ఉన్నారు.

ఎస్సీ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంసంక్షేమవిభాగం/పాల్వంచ జనవరి3: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సీవో ప్రత్యూష బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025వ విద్యాసంవత్సరంలో 5వ తరగతి ప్రవేశానికై ఆరో తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తుతో పాటు గా రూ.100 రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలను 11.02.2024న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎంపిక చేయబడిన కేంద్రాల్లో నిర్వహిస్తామని ప్రకటించారు.

వానరాల దాడిలో కాంగ్రెస్ నాయకుడికి గాయాలు

వైరా, జనవరి 3: వైరా మున్సిపాలిటీ 7వ వార్డు బ్రహ్మణపల్లి అగ్రహారంలో కోతుల దాడిలో కాంగ్రెస్ నాయకుడు పోటు మధుసూదన్ గాయపడ్డారు. మంగళవారం రాత్రి తమ ఇంటి సన్‌సైడ్‌పై ఉన్న కోతిని వెళ్లగొట్టేందుకు మధుసూదన్ ప్రయత్నిస్తున్న సమయంలో ఆయనపై దాడి చేసింది. దాంతో ఆయన చేతికి గాయాలయ్యాయి. కొన్ని నెలల నుంచి మరల కోతులు స్వైరవీహారం చేస్తుండడంతో ప్రజలు హడలిపోతున్నారు.

సబ్ డివిజన్‌లో పర్యటించిన డీసీసీబీ చైర్మన్


కూరాకులను సన్మానిస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్, జనవరి 3: ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం బుధవారం మణుగూరు సబ్ డివిజన్‌లో పర్యటించారు. పర్యటనలో బాగంగా మణుగూరు సొసైటీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ పనితీరును అడిగి తెలుసు కున్నారు. అనంతరం అశ్వాపురం డీసీసీబీ బ్యాంక్‌ను సందర్శించారు. బ్యాంక్ లావాదేవిలు, రైతుల బకాయిలతోపాటు బ్యాంకు సంబంధించిన లావాదేవిలను అడిగితెలుసుకున్నట్లు తెలిసింది. ఈ పర్యటనలో చైర్మన్‌తోపాటు సీఈఓ రెహమాన్ ఉన్నారు. కాగా మణుగూరు వచ్చిన చైర్మన్ నాగభూషణంను యాదవ సంఘం నాయకు లు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకలు ఎం శ్రీనివాస్, మంగి మల్లిఖార్జున్, గోకుల కృష్ణ, మట్టపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్లను సందర్శించిన కేంద్ర కమిటీ సభ్యులు


అస్యూరెన్స్ సభ్యులతో ఆసుపత్రి సిబ్బంది

సుజాతనగర్, జనవరి 3: మండలంలోని సింగభూపాలెం, పాత అంజనాపురం గ్రామాలలో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్క్యూఎస్) కేంద్ర కమిటీ సభ్యులు బుధవారం పర్యటించింది. ఆరోగ్య కేంద్రాల ద్వారా గర్భిణులకు, పిల్లలకు, పెద్దలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రాలకు వస్తున్న రోగుల సంఖ్య, కేంద్రాల పరిశుభ్రత, గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న వైద్య సేవలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టీమ్ సభ్యులు డాక్టర్ వసంత్, డాక్టర్ సంతోష్, డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష, డిప్యూటీ డాక్టర్ డా. సుకృత, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ స్పందన, డాక్టర్ బాలాజీ, డాక్టర్ పర్శ్యా నాయక్, డాపీవో దుర్గ, డాక్టర్ రమేష్, సూపర్‌వైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

'మరుగు'కు మోక్షం

- రూ.15లక్షల పెండింగ్ బిల్లుల కోసం మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఆపిన కాంట్రాక్టర్
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో మళ్లీ పనులు ప్రారంభం


నిర్మాణం పూర్తి చేసికుంటున్న మరుగుదొడ్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రఘునాథపాలెం, జనవరి 3: ఖమ్మం జిల్లా కేంద్రంలో రూ.వందల కోట్లతో అతిపెద్ద అనేక ప్రభుత్వ భవనాలు, కూరగాయల మార్కెట్లు నిర్మాణం చేసిన కాంట్రాక్టర్, తహసిల్దారు కార్యాలయం నిర్మాణంలో కేవలం రూ.15లక్షల పెండింగ్ బిల్లులు ఇవ్వలేదని ఆరు నెలలుగా రెవెన్యూశాఖ మహిళ ఉద్యోగులు ఉగ్గపట్టి ఇబ్బందికి గురి చేశారు. మూత్ర సంబందిత వ్యాధులు వ్యాప్తి చెందేందుకు కాంట్రాక్టర్ కారణమయ్యారు. విషయం తెలుసుకున్న ఆంధ్రజ్యోతి రెవెన్యూ ఉద్యోగుల గోడును డిసెంబరు 31న 'మరుగు' ను మరిచారు అనే కథనంతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో స్పందించిన ఇంజనీరింగ్‌శాఖ అధికారులు కాంట్రాక్టర్‌తో ఒప్పించి నిలిచిపోయిన మరుగుదోడ్ల నిర్మాణం పనులు ప్రారంబించారు. దీంతో మరో నాల్గు రోజుల్లో తహసిల్దారు కార్యాలయం ఉద్యోగులతో పాటుగా కార్యాలయానికి వచ్చే ప్రజలకు మరుగుదోడ్లు అందుబాటులోకి రానున్నాయి.

రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని

కొత్తగూడెం టౌన్, జనవరి 3: రైతులకు పంట పెట్టుబడులను పెట్టేందుకు ప్రభుత్వం మంజూరు చేసే రైతుబంధు సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మంచికంటిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసంగి రైతులకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం రూ. 15వేలు రైతుబంధు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. రైతులకు సంబంధించిన రూ.2లక్షల రుణాలను మాఫీ చేయడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలోని రైతులకు సైతం రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన రైతులందరికి రైతుబంధును అమలు చేయాలని, కౌలు రైతులకు సైతం వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు యలమంచలి వంశీ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని అయిలయ్య, నాయకులు అన్నవరపు సత్యనారా యణ, కున్సోత్ ధర్మా, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, నర్సయ్య, శంకర్, జగన్నాధం, శ్రీనివాసరావు, కేశవరావు, ఈశ్వర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని

ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి 22 మంది డీఆర్‌పీల కేటాయింపు


డీపీఆర్‌తో సమీక్షిస్తున్న సూపరిన్‌టెండెంట్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 3: జిల్లా రెసిడెన్సీ ప్రోగ్రామ్ (డీఆర్‌పీ) కింద జిల్లా జనరల్ ఆస్పత్రికి 22 మంది పీజీ విద్యార్థులను కేటాయించారు. మమత మెడికల్ కళాశాలలో పీజీ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థులను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించారు. ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఈ విద్యార్థులు మూడు నెలల పాటు ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో శిక్షణ పొందుతూ రోగులకు వైద్య సేవలను అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు బుధవారం ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్‌కు రిపోర్టు చేశారు. విధినిర్వహణ సక్రమంగా నిర్వర్తించాలని హాజరు శాతం తప్పకుండా ఉండాలని వారికి సూపరిన్‌టెండెంట్ సూచించారు.

అర్ధశతాబ్ది ఉద్యమ కారులకు సంక్షేమ పథకాలు అందించాలి

- ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకుల డిమాండ్

కల్లూరు, జనవరి 3: అర్ధశతాబ్ది క్రింతం తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన ఉద్యమకా రులందరికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్ కాంతేశ్వరరావు కోరారు. గురువారం కల్లూరులో జిల్లా స్థాయిలో అర్ధశాతాబ్దకాల తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు కాంతేశ్వరరావు ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ ఉద్యమకారులకి, అమరులైన, జైలు శిక్షలు పడిన, ఉద్యోగాలు కోల్పోయిన వారందరికి ప్రభుత్వం సంక్షేమ రాయితీలు, ఆర్థిక చేయూత నందించాలని అన్నారు. ఆయా సంక్షేమ రాయితీలను నాటి (50 సంత్సరాల క్రితం) ఉద్యమకారులందరిని గుర్తించి అందేలా న్యాయం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించేలా సంక్షేమ బోర్డును కూడ ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తల్లపురెడ్డి నరిసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శీల మోహనరెడ్డి, చీఫ్ వర్కింగ్ ప్రసిడెంట్‌గా గులాం జాఫర్, కృష్ణబాబులు ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్ధశాతాబ్ది తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉద్యమకారులు

ప్రమాదకరంగా వంతెనలు

- ప్రధానకాలువపై ఉన్న బ్రిడ్జికి రక్షణ గోడ లేకపోవడంతో పొంచిఉన్న ప్రమాదం
- ఆ వంతెనపై ప్రయాణించేందుకు భయపడుతున్న ప్రజలు
- శిథిలావస్థలో తనికెళ్ల బ్రిడ్జి
- పట్టించుకోవాలని కోరుతున్న ప్రజలు


తనికెళ్ల-- బోడియాతండా మధ్య బ్రిడ్జి పరిస్థితి

కొణిజర్ల, జనవరి 3: నిత్యం ప్రజలు నడిచే రహదారులపై నిర్మించిన కాల్వల వంతెనలు శిథిలా వస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. ఏ క్షణం ఏం జరుగుతుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. ప్రతి ఏటా కోట్లాదిరూపాయాలు సాగర్‌కాల్వల మరమ్మతులకు కేటాయిస్తున్న ప్రమాదాలు ఉన్న చోట వంతెనలను పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారులు, నేతలు వంతెనలపై నిఘా పెడితే వంతెనలు బాగుపడతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పగలే వంతెనలపై ప్రయాణించాలంటే భయపడుతున్న ప్రజలు రాత్రి వేళల్లో ఎలా ప్రయాణిస్తున్నారో అర్థం చేసుకోవాలని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాహనాలను నడపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు పట్టించుకొని వంతెనలపై రక్షణగోడలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణసంకటంగా మారిన వంతెన

కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామం నుంచి బోడియాతండా గ్రామానికి వెళ్లే రహదారి మధ్య ప్రధానకాల్వపై నిర్మించిన వంతెన రక్షణగోడ ఒకవైపు సగానికి పైగా కూలిపోవడంతో ప్రమాదం పొంచిఉంది. కొణిజర్ల మండలమే కాకుండ ఇదే రహదారిపై రఘునా థపాలెం మండలం గణేశ్వరంకు వెళ్లాల్సి ఉంది. ఆ రెండు గ్రామాల ప్రజలు ఆ వంతెన వద్దకు వచ్చేసరికి ప్రాణాల ను గుప్పెట్లో పెట్టుకొని వాహనాలను నడుపుతున్నారు. స్కూల్ బస్సులు సైతం ఆ వంతెనపై నుంచే వెళ్లాల్సి ఉంది. రక్షణ గోడ లేకపోవడం ఇబ్బందులు తప్పటంలేదన్నారు. గ్రామాలకు వెళ్లేందుకు కాల్వల మధ్య వంతెనలను పట్టించుకోకపోతే గ్రామానికి ఎలా వెళ్తామని, తమ గ్రామాలకు ఇదే రహదారని ఆయా గ్రామాల ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన వంతెనలు ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారని, ఇదే రహదారిపై రాత్రి వేళల్లో అధికారులు ప్రయాణం చేస్తే తమ ఇబ్బందులు అర్థం అవుతాయని, జిల్లా నేతలు ఈ వంతెనను పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తనికెళ్ల వద్ద శిథిలావస్థలో బ్రిడ్జి

మండలంలోని తనికెళ్ల గ్రామ సమీపంలో బీబీసీ మూడవ కిలోమీటరు దగ్గరలో రహదారి మధ్య ఏర్పాటు చేసిన వంతెన కూడ శిథిలావస్థకు చేరింది. వంతెన అడుగు, సైడు భాగం మొత్తం పెచ్చులు ఊడిపోతున్నాయి. వంతెనలో మొక్కలు సైతం మొలుస్తున్నాయి. ఈ రహదారిపైనే తనికెళ్ల, తుమ్మలపల్లి, అన్నవరం, రామనర్సయ్యనగర్ గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. అధికారులు కనికరిస్తే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



రక్షణ గోడ లేకపోవడంతో కనిపిస్తున్న వంతెన, శిథిలావస్థకు చేరిన తనికెళ్ళ వద్ద బీబీసీ కాల్వపై వంతెన

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

టేకులపల్లి, జనవరి 3: ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై మండలంలోని తొమ్మిదవమైలుతండా గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం 9వ మైలుతండాకు చెందిన తేజావతు సేవ (37) ద్విచ క్రవాహనంపై బుధవారం ఉదయం ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి ఇల్లెందు వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుకనుంచి బూడిదలోడుతో వస్తున్న లారీ మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సేవాకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగ సేవా సోమవారం అయ్యప్ప దర్శనానికి వెళ్లివచ్చి మాలతీశాడు. ఈక్రమంలో అయ్యప్ప ఫలహారాలను బంధువులకు పంపిణీ చేయడం కోసం బుధవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి గ్రామంలోనే జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మీ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ రమాణారెడ్డి తెలిపారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు



కొణిజర్ల, జనవరి 3: కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం ఓ కారు పల్టీ కొట్టిన సంఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలు గురు గాయపడ్డారు. పోలీస్‌లు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఉద్యోగ రిత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఎస్ శశికుమార్ కుటుంబంతో కలిసి స్వగ్రామం అయిన శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి వెళ్తున్నారు. కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న నేమ్‌బోర్డుకు తగిలి కారు మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తప్పా కారులో ప్రయాణిస్తున్న శశికుమార్, అతని భార్య కవిత, కుమారుడు పూనిత్, కుమార్తె వందన గాయపడ్డారు. వారిలో కవిత, వందనకు తీవ్రగా యాలు అయ్యాయి. ముందుగా వెంటనే క్షతగాత్రులను కొణిజర్లలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి అక్కడ నుంచి ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదసంఘటనపై వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ శంకర్‌రావు తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

పాల్వంచ, జనవరి 3: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆళ్లపల్లి మండలానికి చెందిన రాజేశ్వరి (24) పాల్వంచ మండలం ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నరిసంహసాగర్‌కు చెందిన కాలం సాములుతో మూడు సంవత్సరాల క్రితం వివాహమయ్యింది. ఈ మధ్య కాలంలో సాములు మద్యానికి బానిసై భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ వేధించసాగాడు. భరించలేకమంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని రాజేశ్వరి ఆత్మహత్య చేసుకుంది. అనంతరం గమనించిన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని రాజేశ్వరి పుట్టింటి వారికి తెలియజేసి అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు కొమరం రాజేష్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

గంజాయి పట్టివేత

ఇల్లెందురూరల్, జనవరి3: ఆంధ్ర నుంచి నర్సంపేటకు మోటర్ సైకిల్‌పై తరలిస్తున్న ఎండు గంజాయిని బుధవారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్‌రావు తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు నుంచి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు 6కేజీల ఎండు గంజాయిని తరలిస్తుండగా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్టు తెలిపారు. ఎండు గంజాయిని రవాణా చేస్తున్న నర్సంపేటకు చెందిన మార్తా సాయికుమార్, మహమ్మద్ సోహైల్‌లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సర్వేశ్వర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఖమ్మం క్రైం, జనవరి 3: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ దానవాయిగూడేనికి చెందిన అట్లూరి రాధాక్రిష్ణమూర్తి(61) అనే వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. జిల్లా జైలు సమీపంలో మంగళవారం రాత్రి ఎదురుదురుగా ద్విచక్రవాహనల ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో రాదాక్రిష్ణ తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈవిషయంపై కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు ఖమ్మం అర్బన్ పోలీసులు కేసనమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం,జనవరి3: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందిడు. ఖమ్మం నుంచి పందిళ్లపల్లి వేళ్లే రైల్వే ట్రాక్‌పై రైలుకిందపడి సుమారు 55సంవత్సరాల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందడంతో రైలు సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్ళి మృతదేహన్ని పరిశిలించారు. అనంతరం అన్నం శ్రీనివాసరావు సహాయంతో మృతదేహన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంచు సోయగాలు



ఆళ్లపల్లిలో సాలెగూడుపై మంచు బిందువులు

పొగమంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. తెల్లవారు జామున కురుస్తున్న మంచు చూపరులను ఆకర్షిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బుధవారం పల్లెలతో పాటు పట్టణాలను మంచు తెర కమ్మేసింది. పొద్దు పొద్దున్నే పక్షుల కిలకిల రావాలు.. పవ్వులపై మంచు బిందువులు ఆకట్టుకుంటున్నాయి. హిమాలయాలే తరలివచ్చాయా అన్నట్లుగా వైరా, ఆళ్లపల్లి ప్రాంతాల్లో వాతావరణం హిమగిరులను తలపించింది. ఎటు చూసినా దట్టంగా కమ్ముకున్న పొగమంచు, మంచు బిందువులు, చలి గాలులు వెరసి ఆహ్లాదకర వాతావరణం నెలకొని ప్రకృతి ప్రేమికులను కట్టిపడేసింది. పొగమంచు తీవ్రతకు వాహనదారులు హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు. పొగమంచును చీల్చుకుంటూ వస్తున్న ఉదయ భానుడి దృశ్యాలు చూపరులకు కనువిందు చేశాయి.

- వైరా/ ఆళ్లపల్లి

అంబేద్కర్ భవనాన్ని మరిచారు

- బుట్టదాఖలైన రూ.70లక్షలతో మరమ్మతుల అంచనాలు
- శిథిలావస్థలో దళితుల భవన సముదాయం


అంబేద్కర్ భవనం



మరమ్మతులు చేయాల్సిందివే...

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి3: పేద దళితులు అరకొరగా సదుపాయాలు ఉన్న వారి నివాస సముదాయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించుకోవడం ఒకింత ఇబ్బందికరమే. వారికి ప్రత్యేకంగా ఓ ఫంక్షన్ హాలు ఉంటే బాగుంటుందనే ఆలోచన ఈ నాటిది కాదు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆలోచనలకు రూపమే అంబేద్కర్ భవనం. ఖమ్మం నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డులో తొలి దళితభవనానికి 25 డిసెంబరు 1998న మంత్రి తుమ్మల ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. నిర్మించింది దళితుల కోసమైనా ప్రభుత్వ అవసరాల కోసం కూడా అంబేద్కర్ భవనాన్ని అధికారికంగా వినియోగించారు.అయితే తర్వాత కాలంలో ఇదే ప్రాంతంలో టీటీడీసీ భవన సముదాయం అందుబాటులోకి రావటంతో అంబేద్కర్ భవన్‌పై జిల్లా ఉన్నతాధికారుల శ్రద్ధ తగ్గింది.

మరమ్మతులకు పైసా ఇవ్వలేదు..

కాలక్రమేనా అంబేద్కర్ భవన్‌లో ఆధునిక మార్పులు జరగలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఈ భవనం కోసం పైసా కూడా కేటాయించలేదు. భవనానికి మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు దళిత సంఘాలు అనేక సందర్భాల్లో వినతిపత్రాలు సమర్పించారు. దీంతో స్పందించిన అధికారులు భవనానికి రూ.70లక్షల వ్యయం అవసరమని అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపారు. కానీ పైసా మంజూరు కాలేదు.

మంత్రి తుమ్మలపైనే ఆశలు

అంబేద్కర్ భవనం ప్రధాన ద్వారం తలుపులు పగిలిపోయాయి. స్లాబ్‌కు, గోడలకు బీటలు పడ్డాయి. మరగుదొడ్లు ధ్వంసమైనాయి. తలుపులు, కిటికీలు ఇనపరాడ్లు విరిగిపోయాయి. ఇక వంటగదిపై గోడ పడటంతో పూర్తిగా శిథిలంకాగా తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఇటీవల ఖమ్మం నుంచి గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తిరిగి దళిత సంఘాల్లో అంబేద్కర్ భవనంపై ఆశలు చిగురించాయి. ఆయన ఆలోచన నుంచి సాకారమైన అంబేద్కర్ భవనానికి తారిగా ఆయనే జీవం పోయాలని దళిత సంఘాలు కోరుతున్నాయి. కాగా ఈ భవనం ఇప్పటికీ ఎస్సీలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి అందుబాటులోనే ఉందని సాంఘిక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణను తెలిపారు.


మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న భద్రాద్రి, ఖమ్మం కలెక్టర్లు ప్రియాంక అలా, వీపీ గౌతమ్


మంత్రి తుమ్మలతో భద్రాద్రి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు టీఎస్‌జీవో సంఘం నాయకులు

మంత్రి తుమ్మలకు ప్రముఖుల శుభాకాంక్షలు

- అభివృద్ధి అంశాలను చర్చించిన కలెక్టర్లు ప్రియాంక, వీపీ గౌతమ్

కొత్తగూడెం, ఆంధ్రజ్యోతి/ దమ్మపేట, జనవరి 3: రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం పలువురు ప్రముఖులు కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో మంత్రి స్వగృహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చర్చించారు. ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. మంత్రి తుమ్మలను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, వ్యవసాయ, ఉద్యాన శాఖా అధికారులు, ఎరువులషాపుల డీలర్లు, అటవీ అధికారులు, నీటిపారుదల శాఖా అధికారులు, పశుసంవర్ధకశాఖ అధికారులు, పంచాయతీరాజ్, టీఎన్‌జీవో సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రాంచంద్ర ప్రసాద్ , బండి బాస్కర్, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, ఆలపాటి రాము, కేవి సత్యనారాయణ, శ్రీరామ వెంకట్రావు, అత్యం శేఖర్, మాజీసర్పంచ్ అత్తులూరి వెంకటరామారావు ఉన్నారు.


వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు

భద్రాద్రి హుండీ ఆదాయం రూ.1.51 కోట్లు

భద్రాచలం, జనవరి 3: భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు బుధవారం చిత్రకూటమండపం లో జరిగింది. ఈవో ఎల్.రమాదేవి పర్యవేక్షణలో ఈ లెక్కింపు జరగ్గా.. గత 42రోజులకు గాను మొత్తం రూ.1,51,27,386 ఆదాయం సమకూరింది. అలాగే 352 యూఎస్ డాలర్లు, 71 మలేషియా రింగ్స్, ఇండోనేషియాకు చెందిన రూ.1,10,000, కతర్‌కు చెందిన 100 రియాలు, యుఏఈకి 125 దీరమ్స్, ఒమన్ 200 బైస, నేపాల్ 10 రూపాయలు, థాయిలాండ్ 20 బాత్‌లు లభించాయి. అలాగే 92 గ్రాములు బంగారం, 1.5కేజీ వెండి లభించింది. అదేవిధంగా రూ.2 వేల నోట్లు ఎనిమిది లభించాయి. అయితే నవంబరు 22న హుండీలను లెక్కించగా.. 42రోజుల తరువాత బుధవారం మళ్లీ లెక్కింపు నిర్వహించారు. ఇందులో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలకు వచ్చిన భక్తులు వేసిన కానుకలున్నాయి. ఈ హుండీ లెక్కింపును ఈవో రమాదేవితో పాటు ఏఈవో భవానీరామకృష్ణారావు, ఇంజనీరింగ్ ఈఈ రవీంద్రనాథ్, పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్, వైదిక పరిపాలన సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

తొలిరోజు దసరా మండపంలో విలాసోత్సవం

భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం విలాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు దసరా మండపంలో స్వామివారికి విలాసోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా సీతారామచంద్రస్వామిని రంగనాయకస్వామి రూపంలో అలంకరించి మేళతాళాలతో దసరా మండపానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, డాక్టర్ బి సుబ్బరాజు, ఎస్ఎన్‌వి రామారావు, పి.రమేష్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక ప్రసాద నివేదన చేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.ఎల్. కాంతారావు దంపతులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్, పి.దేశప్ప, కంభంపాటి సురేష్ పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం ఎదురుచూపు

- సింగరేణిలో 'పేరుమార్పు'పై స్పందించని యాజమాన్యం
- ఏడాదిగా ఎదురుచూస్తున్న కార్మికుల వారసులు
- ఆశలన్నీ గుర్తింపు సంఘం పైనే

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 3: సింగరేణి కార్మికుల పేరుమార్పుపై యాజమాన్యం స్పందించకపోవడంతో వారసులు ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. సింగరేణి పరిధిలోని వివిధ ఏరియాల్లో పని చేస్తున్న 1000మందికి పైగా కార్మికులు ఇతర పేర్లతో ఉద్యోగాలు చేస్తున్నారు. కార్మికుల పేరుమార్పు ప్రక్రియను పూర్తి చేస్తామంటూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో కార్మికుల వారసులు సింగరేణి అధికారుల చుట్టు ఉద్యోగాల చుట్టు తిరుగుతున్నారు. అలియస్ సమస్యను పరిష్కరించడంలో గత గుర్తింపు కార్మికసంఘం విఫలమైందనే విమర్శలు వస్తోన్నాయి. ఇప్పటికే విజిలెన్స్ పేరుతో అధికారులు విచారణ నిర్వహించి ఉద్యోగ అవకాశం కల్పించడం లేదని నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, కార్మికసంఘాల నాయకులు సమస్యలను పరిష్కరించకుండ కాలయాపన చేయకుండా నిరుద్యోగుల వయస్సు మీదపడి ఉద్యోగ అవకాశం కోల్పోయే ప్రమాదం ఏర్పడుతోంది.

సింగరేణిలోని 11 ఏరియాల్లో పేరుమార్పు సమస్య ప్రధానంగా చర్చ జరుగుతున్నప్పటికీ పరిష్కార దశకు మాత్రం చేరడం లేదు. నూతనంగా ఎన్నికన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కానీ సింగరేణిలో గుర్తింపు పొందిన ఎఐటీయూసీ నాయకులు కానీ ఈ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు నిరుద్యోగులు డిమాండ్ చేశారు.

ఇప్పటికే విజిలెన్స్ విచారణ పూర్తయినా కావాలనే కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సింగరేణిలోని ఇండస్ట్రియల్ రిలేషన్, వెల్ఫేర్ అండ్ పర్సనల్ విభాగాలకు చెందిన అధికారుల మధ్య పూర్తిస్థాయిలో సమన్వయం లేకపోవడం వల్లనే సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికే సింగరేణిలోని వివిధ ఏరియాలకు చెందిన కార్మికుల వారసులు తమ తండ్రి ఉద్యోగాన్ని తమకు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులు, కార్మిక సంఘాల నాయకులను వేడుకుంటు న్నారు. కార్మికులు పదవి విరమణ చెంది ఏడాది దాటినా వారసులకు ఉద్యోగాలు రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొం టున్నారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీధర్, డైరెక్టర్ (పా) బలరాంలు జోక్యం చేసుకుని వెంటనే సమస్యను పరిష్కరింపచేయాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పలువురు కార్మికుల వారసులు పేర్కొంటున్నారు.

సీఎంఆర్ బియ్యం పంపిణీని త్వరగా పూర్తిచేయాలి

- మిల్లర్స్‌తో సమీక్షలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్


మిల్లర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 3: సీఎంఆర్ బియ్యం పంపిణీని త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్లో అధికారులు, రైస్‌మిల్లర్లతో ఖరీఫ్ 2022-23 సీజన్‌కు సంబందించిన సీఎంఆర్ రైస్ పంపిణీపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లు ఎఫ్‌సీఐకి సీఎంఆర్ బియ్యం డెలివరీ చేయడంలో ఎదరువుతున్న ఇబ్బందులపై చర్చించారు. బాకీ ఉన్న బియ్యాన్ని జనవరి 10లోగా ఎఫ్‌సీఐ కి పంపిణీ చేయాలన్నారు. సీఎంఆర్ రైస్ డెలివరీపై మిల్లర్లతో తిరిగి సమీక్ష సమావేశాన్ని నిర్వహించి లక్ష్యాన్ని చేరుకోని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీలత, రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరావు పాల్గొన్నారు.

ప్రజాపాలన సభల ఏర్పాట్లు బాగుండాలి

ప్రజాపాలన గ్రామ సభల నిర్వహణకు ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో ప్రజాపాలన కార్యక్రమంపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ వరకు చేపట్టే ప్రజాపాలన కార్యక్రమంలో మిగులు రోజులు మేజర్ గ్రామాల్లో ఉన్నందున అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రాబోయే సభల కు ఇంటింటికీ దరఖాస్తుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అదనంగా దరఖాస్తులు కావాల్సిన చోట వెంటనే సమకూర్చాలన్నారు. సభాస్థలి వద్ద దరఖాస్తులు బఫర్‌గా అందుబాటులో ఉంచాలన్నారు. బల్క్ పంపిణీ బల్క్ దరఖాస్తుల స్వీకరణ చేయవద్దని కలెక్టర్ సూచించారు. సభల ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకోవాలన్నారు. షామియానాలు తాగునీరు. సరైన వెలుతురుకు చర్యలు తీసుకోవాలని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తుతో పాటు ఇతర దరఖాస్తులు అందిస్తే తీసుకోవాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, మండల ప్రత్యేక అధికారులు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

వాగ్దానాలకు కట్టుబడి ఉన్నాం

మణుగూరుటౌన్, జనవరి 3: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి ఉందని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచి కమిటీ కార్యదర్శి వై.రాం గోపాల్ అన్నారు. బుధవారం ఏరియాలోని మణుగూరు ఓసీ గనిలో జరిగిన విజయోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. వేజ్‌బోర్డులో ఒప్పందమైన వాటిని సింగరేణిలో అమలు అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో సౌకర్యాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. మణుగూరు ఓసీలో నెలకొన్న సమస్యలపై గని యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం గని మేనేజర్ బెజ్జంకి రాజేశ్వరరావు, సీనియర్ అండర్ మేనేజర్ గున్నయ, కార్మికుల మధ్య కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి తుమ్మలకు వినతి

జూలూరుపాడు, జనవరి 3: జూలూరుపాడులో ఉన్న ఉపమార్కెట్ యార్డు స్థానంలో శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, నాయకులు కోరారు. బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి సొసైటీ చైర్మన్, మండల నాయకులు మంత్రి తుమ్మలను గంగారంలో కలిశారు. శాలువా కప్పి సన్మానించి పుష్ప గుచ్ఛం అందచేశారు. శాశ్వత మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు తుమ్మల సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధనరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మంగీలాల్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు..

చుంచుపల్లి, జనవరి 3: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం సైబర్ క్రైమ్ డీఎస్పీ కృష్ణయ్య అన్నారు. బుధవారం చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన సైబర్ జాగ్రత్త దివాస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్‌క్రైమ్ - మానవ అక్రమ రవాణాల అంశాలపై ఏర్పాటు చేసిన ఈ సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సదస్సులో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, ఎహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ వి.శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ రమేష్, కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్లు డి.చంద్రమోహన్, కే. శోభన్‌బాబు, బి. రవీంద్రరెడ్డి, కే. రమేష్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

అశ్వారావుపేట రూరల్, జనవరి 3: మండలంలోని నారాయణపురం, నారాయణపురం కాలనీలో బుధవారం అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన అక్షింతలను ప్రత్యేక పూజల అనంతరం మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి పంపిణీ చేశారు.

'పాయం'కు మెకానిక్‌ల శుభాకాంక్షలు

మణుగూరుటౌన్, జనవరి 3: మణుగూరు మెకానిక్ వర్కర్ల సంఘం సభ్యులు బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసారు. బొకేను అందించి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెకానిక్‌లు బోసు, ఎస్కే బాబా, చిలకాల సాయిబాబు, తాజుద్దీన్, రవి, సాబ్జీ, కరీముల్లా, మస్తాన్, వెంకటేశ్వర్లు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సేవలు అభినందనీయం

పాల్వంచ టౌన్, జనవరి 3: విశ్రాంత ఉద్యోగుల సేవా కార్యక్రమాలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి అన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పాల్వంచ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సంఘ కార్యాలయంలో నూతన డైరీ క్యాలెండర్‌ను ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమీషనర్‌ను శాలువా బొకేలతో సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, సంఘం మాజీ అధ్యక్షులు డాక్టర్ కొల్లి రాఘవేంద్రరావు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మారావు, షాబుద్దీన్‌ఖాన్, జానిమియా, కన్నయ్య, అక్కినేని కోటయ్య, వెంపటి మురళీ, ఎన్. లక్ష్మయ్య, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు జీఎం సన్మానం

ఇల్లందుటౌన్, జనవరి 3: సింగరేణి ఏరియా అధికారులు అటవీశాఖ ఉన్నత అధికారులను ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక సింగరేణి వసతి గృహంలో అటవీశాఖ సీసీఎఫ్‌వో భీమానాయక్, డీఎఫ్‌వో కృష్ణగౌడ్‌లను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా సింగరేణి జీఎం జాన్‌ఆనంద్, ఎస్‌వోటు జీఎం మల్లారపు మల్లయ్య, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

కిషన్ రెడ్డిని కలిసిన రంగా కిరణ్

లక్ష్మీదేవిపల్లి, జనవరి 3: బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగాకిరణ్ బుధవారం కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి. కిషన్‌రెడ్డిని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి పట్టువస్త్రాన్ని ఆయనకు అందచేశారు. ఈ సందర్భంగా రంగాకిరణ్ మాట్లాడుతూ బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవం కిషన్ రెడ్డి చేతుల మీదుగా జరగాలని జిల్లా కార్యకర్తలు కోరుకుంటున్నారని వారికి తెలిపారు. స్పందించిన కిషన్‌రెడ్డి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చినట్లు రంగాకిరణ్ తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఉన్నట్టా.. లేనట్టా..?

గన్నీ బ్యాగులు లేవంటున్న జీసీసీ సిబ్బంది

ప్రైవేటు వ్యాపారుల ధాన్యం సేకరణలో మతలబేమిటో?

దుమ్ముగూడెం, జనవరి 3: మారాయిగూడెంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ఉందో లేదో స్థానిక ఆదివాసీ రైతులకు అర్థం కావడం లేదు. పది రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జీసీసీ ఆధ్వర్యంలో ప్రారంభించగా, అక్కడ కొనుగోలు సిబ్బంది ఎవరూ కనబడడం లేదు. దీంతో ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలనుకుంటున్న ఆదివాసీ రైతులకు మొండిచేయి మిగిలింది. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియని ఆదివాసీ రైతులు ప్రైవేటు దళారీలకు ధాన్యాన్ని విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రంలో జీసీసీ సిబ్బంది అందుబాటులో లేకపోవడం, అవసరమైన గన్నీ బ్యాగులను రైతులు అడిగినా లేదంటున్నారనే ఆరోపణలున్నాయి. ఐతే సన్నకారు రైతులకు బ్యాగులు లేవంటున్న జీసీసీ సిబ్బంది స్థానిక ప్రైవేటు ప్రైవేటు వ్యాపారులు, పెద్ద రైతుల నుంచి కమీషన్లకు ఆశపడి వారికి వందలాది గన్నీ బ్యాగులిచ్చి ధాన్యాన్ని సేకరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బంది అందుబాటులో ఉండడంతోపాటు గన్నీ బ్యాగులను సరఫరా చేసి ధాన్యాన్ని సేకరించాలని స్థానిక ఆదివాసీ రైతులు కోరుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులకు టోకెన్ ఇవ్వడంతోపాటు, అవసరమైన గన్నీ బ్యాగులను జీసీసీ సిబ్బంది సరఫరా చేయాలి. కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని ఆరబోసి, ఒకట్రెండు సార్లు ఫ్యానుల సాయంతో శుభ్రపరిచి సరిపడా తేమశాతం వచ్చాక మాత్రమే ధాన్యాన్ని సేకరించాలి. ఐతే ప్రస్తుతం మారాయిగూడెం కొనుగోలు కేంద్రం వద్ద ఈ నిబంధనలేమీ అమలవడం లేదు. ఇప్పటికి రెండు లారీ లోడుల ధాన్యాన్ని జీసీసీ సిబ్బంది కొనుగోలు చేసినట్లు తెలుస్తోండగా......నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రం వద్ద కాకుండా ప్రైవేటు వ్యాపారస్తులు, బడా రైతుల ఇళ్లు, పొలాల వద్ద ధాన్యాన్ని సేకరించినట్లు తెలుస్తోంది.

గతేడాదీ నష్టపోయిన ఆదివాసీ రైతులు

మారాయిగూడెం కొనుగోలు కేంద్రం సిబ్బంది నిర్వాకంతో గతేడాది వారికి ధాన్యం విక్రయించిన కొందరు ఆదివాసీ రైతులు తేమశాతం కోత పేరుతో తీవ్రంగా నష్టపోయారు. తెలంగాణా సరిహద్దు ఏపీ రాష్ట్రానికి చెందిన తునికిచెరువులో రెండు వందల బస్తాల ధాన్యాన్ని స్థానిక రైతుల పేరిట సేకరించగా, ఎక్కడ పడితే అక్కడ ప్రైవేటు వ్యాపారుల ధాన్యాన్ని సేకరించి స్థానిక ఆదివాసీ రైతుల ధాన్యం బస్తాలతో కలిపి మిల్లర్లకు పంపారు. కల్లాల్లో ఆరబోసిన ఆదివాసీ రైతుల ధాన్యం తేమశాతం సరిపడా ఉన్నప్పటికీ, బయట ప్రాంతాల్లో కమీషన్లకు ఆశపడి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను కలపడంతో రైతులకు ధరలో కోతపడింది. ధాన్యం విక్రయిస్తామని మారాయిగూడెం కొనుగోలు కేంద్రం వద్దకు వస్తే కనీసం



మారాయిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రం

గన్నీ బ్యాగులు కూడా ఇవ్వడం లేదని, అసలు అక్కడ సిబ్బంది కూడా ఎవరూ ఉండడం లేదని స్థానిక రైతులు తెల్లం సీతారాములు, అపకా బాలరాజులు తెలిపారు. వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని కోరారు. కొనుగోళ్లు లేకపోవడంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమ సమస్యను పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా ఈ విషయమై జీసీసీ మేనేజర్‌ను వివరణ కోరేందుకు పలుమార్లు ఫోనులో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రామాలయానికి శంకుస్థాపన

టేకులపల్లి, జనవరి 3: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వగ్రామం మండలంలోని కోయగూడెంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి రూ.50లక్షల సర్వశ్రేయోనిధితో చేపట్టిన కోదండరామాలయ నిర్మాణం పనులకు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం శంఖుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, లక్ష్మీ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కూడ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉమా సురేందర్, ఎంపీటీసీ సభ్యులు సంధ్యా మురళి, అన్నపురెడ్డిపల్లి శివాలయ ధర్మకర్త మారగాని శ్రీనివాసరావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కనకయ్య

టీ హబ్‌కు క్షయ నిర్ధారణ పరికరాలు తరలిస్తే సమస్యే

భద్రాచలం, జనవరి 3: భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాల ప్రాంగణంలో అదనపు జిల్లా క్షయ నివారణ కేంద్రంలోని పరీక్ష యంత్రాలను గత ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్తగూడెం టీ హబ్‌కు తరలిస్తేతమకు సమస్యేనని ఏజెన్సీవాసులు వాపోతున్నారు. భద్రాచలంలో ఉన్న కేంద్రంలో దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతవాసులతో పాటు సరిహద్దున ఉన్న చత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన వారికి సైతం ఇక్కడ క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా భద్రాచలంలోని క్షయ నిర్ధారణ పరికరాలు రెండు కొత్తగూడెం టీహబ్‌కు తరలింపు ప్రయత్నం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. తీవ్రమైన దగ్గుతో బాధపడేవారు తమ తెమడతో క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే వారికి క్షయ నిర్ధారణ అయిన రోజు నుంచి మందులు అందించి వారితో వాడించాల్సిన పరిస్థితి ఉంటుందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి. ఆ విధంగా చేస్తున్న సమయంలో కూడా కొంత మంది కొద్దిగా తగ్గిన అనంతరం అర్ధాంతరంగా మందులను ఆపివేస్తున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పీహెచ్‌సీల నుంచి సేకరించిన తెమడను టీ హబ్‌కు తరలించి అక్కడ పరీక్ష అనంతరం సమాచారం ఇవ్వడంలో సమయం పట్టే అవకాశం ఉండటంతో ఈ క్రమంలో ఆ వ్యక్తికి క్షయ నిర్ధారణ అయితే మందులు ఏ విధంగా అతనికి అందజేయాలి అనే ప్రశ్న తలెత్తుతుందని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. నిర్ధారణ అయిన రోజు నుంచే మందులు వాడాల్సిన పరిస్థితుల్లో కొద్ది సమయం అనంతరం మందులు వాడితే అప్పటి వరకు క్షయవ్యాధి సదరు వ్యక్తి ద్వారా ఇతరులకు తెలియకుండానే ప్రబలే అవకాశం ఉందని వైద్య వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

పరికరాల తరలింపు ఆపాలంటూ సీపీఎం ధర్నా

భద్రాచలంలోని అదనపు జిల్లా క్షయ నివారణ కేంద్రంలోని పరికరాలను కొత్తగూడెంకు తరలించే ప్రయత్నం ఆపాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌కు త్రం అందజేశారు. ఈ ప్రయత్నాన్ని సత్వరమే ఆపాలని వారు కోరారు. ఆనాటి శాసన సభ్యులు కుంజా బొజ్జి కృషి ఫలితంగానే భద్రాచలంలో ఏర్పాటు చేయడం జరిగిందని వేలాది మందికి క్షయరోగ నివారణకు ఇక్కడ వైద్యాధికారులు కృషి చేస్తున్నారని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఎంబీ నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు, వై.వెంకటరామారావు, ఎస్.సంతోష్‌కుమార్, ఎన్.లీలావతి, డి.సీతామహాలక్ష్మి, ఎంవీఎస్ నారాయణ, శ్రీనివాస్ బి.ధర్మారావు పాల్గొన్నారు.

సభ నిర్వహణపై ఎమ్మెల్యే అసహనం

జూలూరుపాడు, జనవరి 3: ప్రజాపాలన కార్యక్రమ ఏర్పాటు విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారంటూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పడమట నర్సాపురం పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన గ్రామసభను అధికారులు ఏర్పాటు చేయగా ఈ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారని తెలిసి కూడా సరైన వేదిక, వసతులు కల్పించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పంచాయతీకి ప్రత్యేక అధికారి ఎవరని ఎంపీడీవో వెంకటేశ్వరరావుని ప్రశ్నించారు. వేదిక, కుర్చీలు లేకపోవడంతో తాను ఎక్కడ కూర్చోవాలన్నారు. ప్రజలకు వసతులు కల్పించకపోవడం తగదని మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం కావొద్దని సూచిం చారు. వేదిక, కుర్చీలు లేకుండ నీవు ఎక్కడ కూర్చున్నావని సర్పంచ్ కత్రం మోహన్‌రావుని ఎమ్మెల్యే అడిగారు. కౌంటర్ వద్ద బల్లపై కూర్చున్నానని సర్పంచ్ తెలపడంతో నీవు అక్కడ ఎలా కూర్చున్నావని అన్నారు. అధికారులతో తాను స్నేహపూర్వకంగా మెలుగుతానని, దానిని ఆసరా చేసుకుని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించనని ఆయన హెచ్చరించారు.

అధికారం లేదని అధైర్య పడొద్దు: మెచ్చా

అశ్వారావుపేట రూరల్, జనవరి 3: అధికారం లేదని ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు పార్టీతో పాటు తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. అశ్వారావుపేటలోని సత్యసాయిబాబా కళ్యాణ మండపంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వివిధ గ్రామాల నుంచి పార్టీ నాయకులు తరలివచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిద్దామని, పార్లమెంట్ ఎన్నికలకు క్యాడర్‌ను సన్నద్ధం చేద్దామని కోరారు. పార్లమెంట్ ఎన్నికలలో విజయమే లక్ష్యంగా అందరమూ కలసి పనిచేయాలని కోరారు. 9వ తేదీన హైదరాబాదులో జరిగే పార్లమెంట్ ఎన్నికల సమాయత్త సమావేశానికి నియోజకవర్గం నుంచి ముఖ్యులు బయలుదేరి రావాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, ములకలపల్లి జడ్పీటీసీ సున్నం నాగమణి, పార్టీ మండల కార్యదర్శి వెంకన్నబాబు, పార్టీ నాయకులు సూర్యప్రకాశరావు, సోయం వీరభద్రం, వగ్గెల పూజ, మోహనరెడ్డి, వెంకటనరసింహం, చంద్రమోహన్, సంకా ప్రసాద్, లక్ష్మీనర్సయ్య, నారం రాజశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెచ్చా

కొనసాగుతున్న 'ప్రజాపాలన'

ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామసభలు కొనసాగుతున్నాయి. సభల్లో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఐదో రోజు బుధవారం వివిధ పథకాల కోసం ప్రజలు తమ దరఖాస్తులను అందజేశారు.

ప్రజాభీష్టం మేరకే ప్రజాపాలన: జారే

అశ్వారావుపేట రూరల్: ప్రజాభీష్టం మేరకు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో వారి అభీష్టం ప్రకారమే పాలన ఉంటుందని, ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేట, పేరాయిగూడెం పంచాయతీల్లో బుధవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. ఆయా పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచులు అట్టం రమ్య, నార్లపాటి సుమతి, తహసీల్దారు కృష్ణప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి పురంధర్, ఈవో హరికృష్ణ, ఎంపీటీసీ మిండా హరి, భారతి, తిరుమలదేవి, సొసైటీ చైర్మన్ సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు పాష, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జూపల్లి రమేశ్, చెన్నకేశవరావు, ప్రమోద్ పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించొద్దు: పాయం

ఆళ్లపల్లి: సంక్షేమ పథకాల దరఖాస్తులో గత ప్రభుత్వం మాదిరిగా దళారులను నమ్మి ప్రజలు మోసపోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని పినపాక శాసనసభ సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన ఆళ్లపల్లి మండలంలో మర్కోడు, ఆళ్లపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంజు భార్గవి, సర్పంచ్‌లు శంకర్ బాబు, కోటేశ్వరావు, వైస్ ఎంపీపీ ఎల్లయ్య, ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ వీరభద్రం, ఏడీఏ తాతారావు, ఎంపీవో శ్రీనివాసరావు, ఏఈ అఖిల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ సమస్యను పరిష్కరిస్తా

గుండాల: ప్రజాపాలనతో ప్రజల ముంగిట్లోకి ప్రభుత్వం వచ్చిందని, మీ బిడ్డగా ప్రతీ సమస్యను పరిష్కరిస్తూ అర్హులందరికి ఇందిరమ్మ సంక్షేమ ఫలాలు అందించే బాధ్యత తీసుకుంటున్నానని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని సాయనపల్లి, దామరతోగు గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకొని ధరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముక్తి సత్యం, జడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీటీసీ కల్తి క్రిష్ణారావు, సర్పంచ్‌లు కొడెం ముత్యమాచారి, పూనెం సమ్మయ్య, అజ్మీర మోహన్, రామ్మూర్తి, సరోజ, ఏడీఏ తాతారావు, తహసీల్దార్ హెచ్ రంగా, ఎంపీడీవో ఎస్‌వీ సత్యనారాయణ, ఎంపీవో హజ్రత్ వలీ, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రతీ గడపకు అందిస్తాం: ఎమ్మెల్యే

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరుగ్యారెంటీ పథకాలను ప్రతీ గడపకు అందిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని పడమట నర్సాపురం, జూలూరుపాడు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. మహిళల నుంచి దరఖాస్తులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కేక్‌ను కట్ చేసి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, ఎంపీవో తులసీరాం, సీడీపీవో నిర్మల జ్యోతి, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పురుషోత్తం, సర్పంచులు గుండెపిన్ని విజయ, కత్రం మోహన్‌రావు, ఎంపీటీసీ దుద్దుకూరి మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

పరిశీలించిన కలెక్టర్

దమ్మపేట: మొండివర్రె గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభను కొత్తగూడెం కలెక్టర్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. దర్భంగా గ్రామ సభకు వచ్చిన మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీవో రమాకాంత్, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో నాగేశ్వరరావు తదితరులు వున్నారు.

సదస్సులను సందర్శించిన డీఎస్పీ

మణుగూరుటౌన్: మణుగూరు సబ్ డివిజన్‌లో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన సదస్సులను మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు సందర్శించారు. మణుగూరు మండలంలోని ముత్యాలమ్మనగర్, అశ్వాపురం మండలంలోని గొందిగూడెం, ఎలకలగూడెంతోపాటు తదితర గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాలను పరిశీలించారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం మండలంలోని నెల్లిపాక బంజర్, గొందిగూడెం, ఎలకల గూడెం గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన సభలను ఎంపీపీ ముత్తినేని సుజాత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామసభను సందర్శించిన జడ్పీ సీఈవో

పాల్వంచ: పాల్వంచ మండల పరిధిలోని నాగారంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను జడ్పీ సీఈవో విద్యాలత సందర్శించారు. అధికారులకు తగు సూచనలందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభయ హస్తం గ్యారంటీలకు ధరఖాస్తు చేసిన ప్రతి ఒక్కరికీ రశీదు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, ఏపీఓ రంగా, ఏఈలు నీలావతి, దేవదాసు, ఆర్ఐ హచ్చ, పంచాయతీ సర్పంచ్‌లు బానోతు రాజా, అనిత, కార్యదర్శులు సాయిరాం, దుర్గారావు పాల్గొన్నారు.

గడువు దాటినా దరఖాస్తులు స్వీకరిస్తాం

చంద్రుగొండ: ప్రజాపాలన దరఖాస్తులు గడువు(6వతేదీ)తరువాత కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని మండల ప్రత్యేక అధికారి సంజీవరావు తెలిపారు. బుధవారం మండలంలో జరుగుతున్న ప్రజాపాలన గ్రామసభలను పరిశీలించి దరఖాస్తుదారులతో మాట్లాడారు. అనంతరం ఆయన అయిన్నపాలెం గ్రామసభ వద్ద విలేకరులతో మాట్లాడారు.

ఐదో రోజున 2117 దరఖాస్తులు

దుమ్ముగూడెం: ప్రజాపాలన గ్రామసభ ఐదోరోజైన బుధవారం దుమ్ముగూడెం, నారాయణరావుపేట, ప్రగళ్లపల్లి, ఆర్లగూడెం, నరసాపురం, నడికుడి గ్రామపంచాయతీల్లో జరిగింది. ఆరు గ్రామపంచాయతీల్లో మొత్తం 2117 దరఖాస్తులందినట్లు ఎంపీడీఓ ముత్యాలరావు తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓ సమ్మయ్య, ఏఓ నవీన్‌కుమార్, ఏఈలు శ్రీరాం, రాము బృందాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరాలి

చుంచుపల్లి: ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరాలని ఆ దిశగా ప్రతి ఒక్కరు పని చేయాలని చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారి సులోచనా రాణి సూచించారు. బుధవారం మండలంలోని రామాంజనేయకాలనీ గ్రామ పంచాయతీలో ఐదో రోజు ప్రజాపాలన గ్రామసభలు కొనసాగగా సభలు జరుగుతున్న సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి తహసిల్దార్ పి. కృష్ణ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, పంచాయతీ సర్పంచ్ సరిత జ్ఞాన మూర్తి, ఎంపీటీసీ ముక్తి సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీచైర్మన్ ఆకస్మిక తనిఖీ..

ఆరు గ్యారెంటీల అమలు కోసం తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ గ్రామపంచాయతీ కొనసాగుతుండగా జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హతగల ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకుంటున్న సరళిని పరిశీలించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఆళ్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం



అశ్వారావుపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే



నాగారంలో దరఖాస్తు స్వీకరిస్తున్న జడ్పీ సీఈవో



చుంచుపల్లి మండలంలో పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి



దమ్మపేట మండలంలో దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్



జూలూరుపాడులో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్